

మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

శ్రమ తోడైతే.. గెలుపు నీదే..

● ఆ అధికారుల స్ఫూర్తితో ఐఏఎస్ సాధన

న్యూస్‌టుడే, మంచిర్యాల పట్టణం:

పట్టుదలతో సాధన చేస్తే ఏదైనా సాధించగలం.. మంచి ఆలోచనలతో పనిచేసే అధికారులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్తే అనుకున్న లక్ష్యాలను చేరుకోగలమని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. “జవహర్ నవోదయలో చదువుతున్న సమయంలో పాఠశాల ఛైర్మన్‌గా ఉన్న అప్పటి కలెక్టర్ నర్మదేశ్వర్‌లాల్ విద్యాభివృద్ధికి కృషి చేశారు. బిహార్‌లో కలెక్టర్‌గా పనిచేసిన కే.కే. పాటిల్ అవినీతిని నిర్మూలించి, పరిపాలన విభాగాలను గాడిలో పెట్టారు. ఆ అధికారులను స్ఫూర్తిగా తీసుకుని ఐఏఎస్ కావాలనే లక్ష్యాన్ని ఎంచుకున్నా. అందుకు తగినట్లుగా సాధన చేశా. శ్రమతోడై నాలుగో ప్రయత్నంలో ఐఏఎస్ సాధించాను. ప్రస్తుతం మంచిర్యాల జిల్లా కలెక్టర్‌గా సేవలు అందిస్తున్నా.” విజయ ప్రస్థానం గురించి ఆయన మాటల్లోనే..

సర్కారు బడిలోనే చదువు

మాది సమస్తీపూర్ జిల్లాలోని ధరహర మండలం బిరోజ్‌పూర్ గ్రామం. చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాభ్యాసం సాగింది. ఒకటి నుంచి 5వ తరగతి వరకు స్వగ్రామంలో.. తర్వాత సమస్తీపూర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివా. ఝార్ఖండ్‌లోని ధన్‌బాద్‌లో ఐఐటీ పూర్తి చేశా. అనంతరం ఓఎన్‌జీసీలో ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం చేస్తూనే ఐఏఎస్ కోసం సాధన చేశా.

20 గుంటల స్థలం మాత్రమే ఉంది

నాన్న విశ్రాంత ఉపాధ్యాయుడు మనోజ్‌కుమార్ సింగ్. తల్లి పుష్పకుమారి గృహిణి. అన్నయ్య ప్రభాత్ ప్రైవేటు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. నాన్నకు 1982లో ఉపాధ్యాయుడిగా ఎంపిక జాబితాలో పేరు వచ్చింది. అప్పుడు ఆ ఉద్యోగం ఆయనకు ఇవ్వకుండా తక్కువ మార్కులు ఉన్న వ్యక్తికి ఇచ్చారు. న్యాయస్థానంలో కేసు వేసి గెలవడంతో 2012లో నాన్నకు ఉద్యోగం వచ్చింది. అందుకే తొమ్మిదేళ్లకే ఉద్యోగ విరమణ పొందాల్సి వచ్చింది. మాకు కేవలం 20 గుంటల స్థలం మాత్రమే ఉంది.

ఉద్యోగం చేస్తూనే సన్నద్ధమయ్యా

ఐఐటీలో మూడో సంవత్సరంలో ప్రభుత్వ కొలువు వచ్చింది. చదువు పూర్తయిన తర్వాత డెహ్రాడూన్‌లో ఆరేళ్లు ప్రభుత్వ ఉద్యోగం చేశా. ఆ సమయంలో ఐఏఎస్‌కు సన్నద్ధమయ్యా. రెండుసార్లు రాత పరీక్షల్లో ఎంపికై ఇంటర్వ్యూలో విఫలమయ్యా. మూడోసారి ప్రయత్నించగా ఐఆర్ఎస్ (ఇండియన్ రెవెన్యూ సర్వీస్)కు ఎంపికై ఇన్‌కం ట్యాక్స్ విభాగంలో పని చేశా. నాలుగో ప్రయత్నంలో ఐఏఎస్‌కు ఎంపికయ్యా. 2018 బ్యాచ్‌కి చెందిన నేను మంచిర్యాల జిల్లాలో శిక్షణ కలెక్టర్‌గా.. తర్వాత పెద్దపల్లి జిల్లాలో అదనపు కలెక్టర్‌గా మూడేళ్లు పని చేశా. అక్కడ పని చేస్తున్న సమయంలో కుటుంబ పెద్దలు స్వస్తికతో వివాహం జరిపించారు. ఆమె గైనకాలజిస్ట్‌గా పని చేస్తున్నారు. తర్వాత నాగర్‌కర్నూల్ జిల్లాలో అదనపు కలెక్టర్‌గా.. అక్కడి నుంచి ఇటీవల పదోన్నతిపై మంచిర్యాల జిల్లాకు కలెక్టరుగా వచ్చా.

తెలంగాణ వంటకాలంటే చాలా ఇష్టం

తెలంగాణలో నాన్‌వెజ్ వంటకాలు అంటే చాలా ఇష్టం. ఇక్కడ మటన్, చికెన్ వంటకాలు ఎక్కడా లేని విధంగా రుచిగా తయారు చేస్తారు. క్రికెట్, టేబుల్ టెన్నిస్ అంటే ఇష్టం. క్రికెట్ ఆడను కానీ చూస్తా. టెన్నిస్ మాత్రం ఇంట్లోనే ఆడతా.

లక్ష్యంతో చదవాలి

మనం చదువుకోవడానికి ప్రభుత్వం ఎంతో సహకారం అందిస్తోంది. యువత ప్రభుత్వ ఫలాలను ఉపయోగించుకుని అన్ని రంగాల్లో దూసుకెళ్లాలి. చెడు అలవాట్లకు దూరంగా ఉండి లక్ష్యంతో చదివితే అనుకున్నది సాధిస్తారు.

దసరా ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌పై వచ్చే నెల 12న నిర్వహించనున్న దసరా పండగ ఏర్పాట్లను శనివారం పురపాలిక కమిషనర్ అంజయ్య, పాలకవర్గ సభ్యులు పరిశీలించారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేయాల్సిన విద్యుత్ దీపాలంకరణ, సౌండ్ సిస్టమ్, వాహనాల పార్కింగ్, పారిశుద్ధ్యం తదితర అంశాలపై చర్చించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసుకున్నట్లు చెప్పారు. డీఈ రమాదేవి, హిందూ ఉత్సవ సమితి నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అవగాహనే ముఖ్యం.. సాధనతో పదిలం



న్యూస్‌టుడే, దండేపల్లి :

విద్యార్థి ఉన్నత చదువులకు తొలిమెట్టు పదో తరగతి. మంచి జీపీఏ సాధించడంతో పాటు విషయ అవగాహనపై పట్టు పెంచుకుంటే ఇంటర్‌తో పాటు వివిధ సాంకేతిక కోర్సుల్లో చేరి ఉన్నత చదువులు అభ్యసించే అవకాశం ఉంది. మార్చిలో పరీక్షలు ఉండటంతో సమయాన్ని వృథా చేయకుండా అడిగిన ప్రశ్నలకు సమాధానాలు రాయాలంటే ఏవిధంగా సాధన చేయాలి.. జీపీఏ పెరగాలంటే ఏయే అంశాలపై పట్టు సాధించాలో తెలుసుకుని అందుకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా ఇప్పటి నుంచే ముందుకు సాగితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారు. ఈ నేపథ్యంలో గణితం, భౌతిక రసాయన, సాంఘిక, జీవశాస్త్ర ఉపాధ్యాయులు అందజేస్తున్న సూచనలు ఇలా...

సూత్రాలు.. గ్రాఫ్‌లు విజయానికి దోహదం



- గణితంలో సూత్రాలు, గ్రాఫ్‌ల నిర్మాణం మార్కులకు దోహద పడతాయి.
- బహుపదులు, సాంఖ్యక శాస్త్రం, రేఖీయ సమీకరణాలు, వర్గ సమీకరణాల నుంచి ఒక గ్రాఫ్ అడుగుతారు.
- సాంఖ్యక శాస్త్రంలో ఓజీ వక్రం, సమితుల్లో వెన్‌చిత్రాలు సాధన చేయాలి.
- త్రికోణమితిలో అనువర్తనాల నుంచి లెక్కలు అడుగుతారు. ఇందులోని కోణ విలువలు, సూత్రాలు చాలా ముఖ్యం.
- వాస్తవ సంఖ్యలు, సంభావ్యత, సమితులు, త్రికోణమితి, క్షేత్రమితి, నిరూపక జ్యామితి, శ్రేఢులు అధ్యాయాలను బాగా సాధన చేస్తే మంచి మార్కులు వస్తాయి.

-మిట్టపల్లి సంతోష్‌కుమార్, గణిత ఉపాధ్యాయుడు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఖానాపూర్, ఆదిలాబాద్ జిల్లా

సమకాలీన అంశాలే కొలమానం



- పేరాగ్రాఫ్ ఇచ్చి విశ్లేషించడం, వ్యాఖ్యానించడం ద్వారా ఆరు మార్కులు వస్తాయి. పట్టిక ఇచ్చి దీనిలోని దత్తాంశాలను విశ్లేషించడం ద్వారా ఆరు మార్కులు సాధించవచ్చు.
- జనాభా, అక్షరాస్యత, దేశ సమగ్రత, గ్లోబల్ వార్మింగ్, హరిత హారం ఇలా అడిగే వ్యాసాలు రాసే తీరును తెలుసుకోవాలి.
- పటం, సమాచార నైపుణ్యాలు, వ్యాఖ్యానం, ప్రశంస, సమకాలీన అంశాలపై శ్రద్ధ చూపాలి.
- భారతదేశ భౌగోళిక స్వరూపం, ఉత్పత్తి ఉపాధి, నదులు, నీటి వనరులు, ఆహారభద్రత, సుస్థిర అభివృద్ధి, దేశ విభజన, స్వాతంత్ర్య ఉద్యమం, తెలంగాణ సాధన ఉద్యమ పాఠ్యాంశాలపై సాధన చేయాలి.
- జవాబులు పాయింట్ల వారీగా రాస్తే మంచి మార్కులు వస్తాయి...

-జి.రవిశంకర్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు, గంగారాం పాఠశాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా

ప్రయోగాలే ప్రధానం...



- ప్రయోగాలనుంచి ఒకటి అడుగుతారు.. ఇందులో ఉద్దేశం, పరికరాలు, ప్రయోగ విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫలితాన్ని కచ్చితంగా సాధన చేయాలి. చక్కగా పటాలు గీసి భాగాలు గుర్తించాలి.
- సమస్యల సాధనకు సూత్రాలను గుర్తుంచుకోవాలి.
- పట్టికల విశ్లేషణ, బొమ్మలు, భేదాలు, ఉదాహరణలు, పోలికలు, పటాలలో తప్పులు సవరించడం తదితర అంశాలను గుర్తుంచుకోవాలి.
- సమీకరణాలను తుల్యం చేయటం, దర్పణాలలో, కటకాలలో ఏర్పడు ప్రతిబింబాలు, వీటి కిరణ చిత్రాలు, నిజజీవితంలో వీటి ఉపయోగాలు, ఓమ్ నియమం, నిరోధాల శ్రేణులు, విద్యుత్తు ప్రవాహంపై సాధన చేయాలి. నవీన ఆవర్తన పట్టిక, పరమాణు నిర్మాణం, క్వాంటమ్ సంఖ్యలు, ఆర్బిటాళ్ల ఆకృతులను అవగాహన చేసుకుంటే మంచి మార్కులు వస్తాయి.

-గోలి రాజగోపాల్, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు, పొన్కల్ పాఠశాల, నిర్మల్ జిల్లా

పటాలు... పట్టికలను పట్టుబడితే చాలు..



- పటాల భాగాలు గుర్తించేటప్పుడు అన్ని ఒకవైపే రాయాలి.
- ప్రతీ పాఠంలో ఫ్లో చార్టు, భేదాలు, ప్రయోగశాల కృత్యాలు చేస్తే 10 మార్కులు వస్తాయి.
- కిరణజన్య సంయోగ క్రియ-శ్వాసక్రియ, అవాయుశ్వాసక్రియ-వాయుశ్వాసక్రియ, రక్తప్రసరణ, విసర్జన, లైంగిక ప్రత్యుత్పత్తి-అలైంగిక ప్రత్యుత్పత్తి, అనువంశికత, లింగ నిర్ధారణ, పోషకాహార లోపంతో కలిగే వ్యాధులు, నెఫ్రాన్ వ్యవస్థ అంశాలను చదివితే మంచి గ్రేడు సాధించవచ్చు.
- నేర్చుకున్న అంశాలను నిజ జీవితానికి అన్వయించే ప్రశ్నలు అడుగుతారు. వీటిని సాధన చేయాలి.

-గంప రవీందర్, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు, దండేపల్లి పాఠశాల, మంచిర్యాల జిల్లా



బురదరోడ్డుపై కాలినడకన పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు



ముత్తంపేట- పార్డీ రహదారిపై నిలిపిన భారీ వాహనాలు

రోడ్డు అధ్వానం.. అవస్థల ప్రయాణం

మండలంలోని ముత్తంపేట నుంచి పార్డీ, సాండ్‌గాం మీదుగా కౌటి గ్రామం వరకు ఇరవై ఏళ్ల క్రితం మొరం రోడ్డు వేశారు. ముత్తంపేట సమీపంలో రహదారికి ఇరువైపులా నాలుగు కంకర స్టోన్ క్రషర్లు ఉన్నాయి. ప్రతి రోజూ క్వారీల నుంచి రాళ్లను తీసుకురావడానికి, తయారైన కంకరను ఇతర ప్రాంతాలకు తరలించడానికి పరిమితికి మించి భారీ వాహనాలు (40 నుంచి 60 టన్నుల) బరువుతో నడుపుతున్నారు. దీంతో మట్టి రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడటంతో రోడ్డు పక్కనే ఉన్న మట్టి వేసి గుంతలు పూడుస్తూ వస్తున్నారు. వర్షాలకు రోడ్డుపై వేసిన మట్టి బురదమయంగా మారడంతో నడక నరకప్రాయంగా మారింది. దీంతో సాండ్‌గాం, వీరవెల్లి, కౌటి గ్రామ పంచాయతీల ప్రజలు పార్డీ గ్రామం వరకు వివిధ వాహనాల ద్వారా చేరుకుని అక్కడి నుంచి ముత్తంపేట గ్రామం వరకు 5 కిలోమీటర్ల దూరం కాలినడకన రావాల్సి వస్తుంది.

- న్యూస్‌టుడే, కౌటాల

విపత్తులపై క్షేత్రస్థాయిలో అవగాహన

కాగజ్‌నగర్ గ్రామీణం: వరదలు, తుపాన్ల నుంచి బాధితులను కాపాడే చర్యలపై కాగజ్‌నగర్ మండలంలోని కోసిని రిజర్వాయర్ వద్ద జాతీయ విపత్తుల రక్షణ దళం ఆధ్వర్యంలో శనివారం అవగాహన నిర్వహించారు. కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల మాట్లాడుతూ.. ప్రమాదవశాత్తు నీటమునిగిన, వరదల్లో చిక్కుకున్న వ్యక్తులను కాపాడే విషయంలో అనుసరించాల్సిన విధానాలను వివరించారు. ప్రధానంగా వరదలు సంభవించిన సందర్భాల్లో అప్రమత్తత ఎంతో అవసరమని తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల

కొలిమి మాయం.. కమ్మి చక్రం పయనం



ఒకప్పుడు ఎడ్ల బండ్లు (కచ్చురం), కమ్మరి కొలిమికి అవినాభావ సంబంధం ఉంటుంది. బండి చక్రాల తయారీ, మరమ్మతులకు కొలిమి వద్ద కమ్మరులకు నిత్యం పని ఉండేది. కాలక్రమేణా కొలిమిలు అంతరించాయి. అక్కడక్కడా పలువురు రైతులు ఎడ్లబండ్లు నడుపుతున్నప్పటికీ బండికి ఇనుపచక్రాలను వినియోగిస్తున్నారు. అయితే కొందరి రైతుల వద్ద కర్ర చక్రాలున్నప్పటికీ కమ్మి (కర్ర చక్రం చుట్టూ ఉండే ఇనుపపట్టీ) అతకాలంటే వెల్డింగ్ దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. గ్రామానికి చెందిన ఓ రైతు ఇలా కర్ర చక్రాన్ని ద్విచక్ర వాహనంపై మండల కేంద్రానికి తీసుకెళ్తూ ‘ఈనాడు’ కెమెరాకు చిక్కారు.

- న్యూస్‌టుడే, దహెగాం

లోక్ అదాలత్‌లో 4,867 కేసుల పరిష్కారం



కేసు పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.వి.రమేశ్

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లాలోని కోర్టుల్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో వివిధ రకాల మొత్తం కేసులు 4,867 పరిష్కరించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.వి. రమేశ్ వెల్లడించారు. బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, పోలీసుల సహకారం, కక్షిదారుల పరస్పర అవగాహనతో భారీ స్థాయిలో కేసులకు విముక్తి లభించిందన్నారు. సివిల్‌తో పాటు రాజీకి అవకాశమున్న క్రిమినల్, ఆబ్కారీ, ప్రి లిటిగేషన్.. ఇలా వివిధ రకాల కేసులకు పరిష్కారం లభించిందని తెలిపారు. వీటిలో కొందరికి అవార్డు జారీ చేయగా కొందరికి జరిమానాల రూపంలో విధించినట్లు చెప్పారు. లోక్ అదాలత్‌లో పరిష్కారం అయిన కేసులకు తదుపరి అప్పీలు చేసుకునే అవకాశం ఉండదన్నారు. దీంతో సమయం, డబ్బు అంతా ఆదా అయి సత్వర న్యాయం అందుతుందని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కోర్టుల్లో జిల్లా ప్రధాన న్యాయమూర్తితో పాటు సీనియర్ సివిల్ జడ్జి కె.యువరాజా, జూనియర్ సివిల్ జడ్జి జె.అనంతలక్ష్మిలు వేర్వేరు బెంచ్‌లు నిర్వహించి కేసులను రాజీ మార్గంలో పరిష్కరించారు.

సిర్పూర్(టి)లో..

సిర్పూర్(టి): సిర్పూర్(టి) జ్యుడీషియల్ సివిల్ కోర్టులో శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్‌లో క్రిమినల్, సివిల్, వివిధ విభాగాలకు సంబంధించి 340 కేసులు రాజీ మార్గంలో పరిష్కరించామని జూనియర్ సివిల్ జడ్జి అజయ్ ఉల్లం తెలిపారు. జరిమానా రూపంలో రూ.16,57,620 విధించామని పేర్కొన్నారు.

భీం వర్ధంతికి పకడ్బందీ ఏర్పాట్లు

జోడేఘాట్‌లో కలెక్టర్ సమీక్ష సమావేశం



భీం సమాధి వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ, అదనపు కలెక్టర్లు, ఐటీడీఏ పీఓ, ఎమ్మెల్యేలు

కెరమెరి, న్యూస్‌టుడే: ఆదివాసీల పోరాట యోధుడు కుమురం భీం వర్ధంతికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. శనివారం కెరమెరి మండలంలోని పోరుగడ్డ జోడేఘాట్‌లో ఎస్పీ శ్రీనివాసరావు, ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు, అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి భీం వర్ధంతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా భీం విగ్రహం, సమాధి వద్ద పూలువేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.

● అక్టోబరు 17న నిర్వహించే వర్ధంతికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పోరు గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్పీ పేర్కొన్నారు. ఐటీడీఏ పీఓ మాట్లాడుతూ ఏర్పాట్లలో లోటుపాట్లు ఉండొద్దని, సమస్యలను నేరుగా తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు.

ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ.. హట్టిఘాట్ నుంచి జోడేఘాట్ మధ్యలో అటవీ అనుమతుల కారణంగా నిలిచిన రోడ్డు పనులను త్వరగా పూర్తయ్యేలా చొరవ చూపాలన్నారు. పోరు గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వర్ధంతి కార్యక్రమం పండగ వాతావరణంలో జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. **ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ..** ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. వర్ధంతికి ముఖ్యమంత్రిని వచ్చేలా చూస్తామన్నారు.

● అనంతరం వర్ధంతి కార్యక్రమానికి వచ్చే ప్రజల కోసం భోజన సౌకర్యం, హట్టి నుంచి జోడేఘాట్ వరకు బస్సు సౌకర్యం, సభావేదిక, స్టాల్, పార్కింగ్, బందోబస్తు తదితర విషయాలపై ఆయా శాఖల వారీగా సమీక్షించారు. భీం మనవడు సోనేరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం భీం ఖ్యాతిని ఇంకా ముందుకు తీసుకెళ్లాలన్నారు. రెండు పడక గదుల ఇళ్లతోపాటు పోరు గ్రామాల సమస్యలను ఉత్సవ కమిటీ ఛైర్మన్ పెందూర్ రాజేశ్వర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో డీడీ రమాదేవి, ఐటీడీఏ ఏపీవో మనోహర్, ఉత్సవ కమిటీ కన్వీనర్ పెందూర్ మోతీరాం, నాయకులు సెడ్మాకి ధ్రుపతబాయి ఆత్రం లక్ష్మణ్, మడావి రాజు ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

పదహారేళ్ల కల.. నెరవేరిన వేళ!


2008 డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం

వారంతా ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా అహర్నిశలు కష్టపడి పోటీ పరీక్షలో నెగ్గారు. ఎంపిక జాబితాలో పేరు చూసుకొని సంబరపడ్డారు. అనూహ్య పరిణామాలతో ఉద్యోగం చేజారి నిరాశకు లోనయ్యారు. కల చెదిరిందనే బెంగతో కుంగిపోయిన వారు కొందరైతే, ప్రత్యామ్నాయాల కోసం ప్రయాస పడుతూ సగం జీవితాన్ని వెళ్లదీసింది మరికొందరు. 2008 డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు కోర్టు ఆదేశాల మేరకు.. ప్రభుత్వం కాంట్రాక్టు విధానంలో బేసిక్ పే చెల్లిస్తూ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా నియమించేందుకు జీవో నం.34 విడుదల చేయడంతో హర్షం వ్యక్తమవుతోంది. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఈ అభ్యర్థులకు శుక్రవారం నుంచి ధ్రువపత్రాల పరిశీలనను విద్యాశాఖ ప్రారంభించింది.

- ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే

కోర్టు తీర్పుతో మారిపోయింది

- దాసరి నారాయణ, ఉమ్మడి జిల్లా 2008 మెరిట్ అభ్యర్థుల సంఘం అధ్యక్షుడు



మాది ప్రస్తుత మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండల వెంకటాపూర్ గ్రామం. బీఎస్సీ బీఈడీ చేసి హైదరాబాద్‌కు కోచింగ్ వెళ్లి డీఎస్సీ రాశాను. 68.5 మార్కులతో 2010 నాటి జాబితాలో చోటు దక్కింది. అప్పుడు ఎస్జీటీ ఉపాధ్యాయుల ఎంపికలో డీఎడ్(టీటీసీ) చేసిన వారికే అవకాశం ఇవ్వాలని సదరు అభ్యర్థులు కోర్టుకు వెళ్లారు. తీర్పు వారికి అనుకూలంగా రావడంతో అప్పటి ప్రభుత్వం జీవో నం.28 విడుదల చేసి మొత్తం పోస్టుల్లో వారికి 30 శాతం కేటాయించింది. అప్పటికే ఎంపికైన తమను జాబితా నుంచి తొలగించి మాకన్నా తక్కువ మెరిట్ వచ్చిన వారిని ఎంపిక చేసి ఉద్యోగాలిచ్చింది. ఇప్పుడు నా వయసు 39. పది, ఇంటర్ చదివే ఇద్దరు పిల్లలున్నారు. ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తూ కష్టంగా జీవితాన్ని వెళ్లదీస్తున్నా. ఆదిలాబాద్ డీఈవో కార్యాలయంలో ధ్రువపత్రాల పరిశీలన చేయించుకున్నా.

ఊహించలేదు

- పంతులు రమాదేవి, సిర్పూరు(టి)



పరీక్షల్లో 62.5 మార్కులు సాధించి ఎంపిక జాబితాలో చోటు సంపాదించుకున్నా. పెళ్లయ్యాక కామారెడ్డికి వెళ్లాను. ప్రస్తుతం ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నా. ప్రతిభ ఉండి జీవితాన్ని కష్టంగా కొనసాగిస్తున్నాం. మళ్లీ ఉద్యోగం వస్తుందని కలలో కూడా ఊహించలేదు. ప్రస్తుతం ధ్రువపత్రాల పరిశీలన పూర్తయింది.

నిరాశతో మళ్లీ పరీక్ష రాయలేదు

- జక్కు సాధన, ఆసిఫాబాద్



పట్టుదలతో చదివి 64 మార్కులు సాధించాను. బీఎస్సీ బీఈడీ ఎస్జీటీ ఉద్యోగానికి ఎంపికయ్యాను. ఆ వెంటనే మాకు మొండిచేయి చూపడంతో తీవ్ర నిరాశకు గురయ్యాను. మళ్లీ డీఎస్సీ రాయలేదు. ప్రస్తుత కాంట్రాక్టు విధానంలో మమ్మల్ని ఎస్జీటీ బేసిక్ పేతో నియమించుకోవడానికి పిలవడం ఆనందంగా ఉంది.

పింఛను అర్హత కోల్పోయాం

- దేశ్‌పాండే అపర్ణ, ఆసిఫాబాద్



బీఎస్సీ బీఈడీ పూర్తి చేసిన తర్వాత ప్రత్యేకంగా కోచింగ్ తీసుకున్నా. డీఎస్సీలో 67.5 మార్కులు సాధించాను. ఎంపిక జాబితాలో 53వ ర్యాంకు వచ్చింది. పెళ్లయి ఇద్దరు పిల్లలున్నారు. ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నాను. ప్రస్తుతం తమను తీసుకునే ప్రక్రియ చేపట్టడం సంతోషం. పదహారేళ్లు నష్టపోయాం. రెండు పీఆర్సీలు పోయాయి. పింఛను అర్హత సర్వీసు 20 ఏళ్లు కూడా దొరకదు. మాకు టైం స్కేలు ఇస్తూ సర్వీసు లెక్కగట్టి న్యాయం చేయాలి.

విద్యుత్తు సరఫరాలో నేడు అంతరాయం

ఆసిఫాబాద్ అర్బన్: ఆసిఫాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలకు ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ సహాయక ఇంజినీరు సదాశివ్ ప్రకటించారు. ఆసిఫాబాద్‌లోని 33/11కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా ఈ అంతరాయం కలుగుతుందని చెప్పారు.







2024 నినాదం 'యూజ్ హార్ట్ ఫర్ యాక్షన్'. 2025 నాటికి గుండె జబ్బు మరణాలను కనీసం 25 శాతం తగ్గించాలనే ఉద్దేశంతో ఈ విషయంలో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలను విస్తృతంగా ప్రచారం చేయటానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ ఏడాది ఇచ్చిన నినాదం ఇది.

రక్తం పోటెత్తి.. గుండె లయతప్పి

● పెరుగుతున్న బాధితులు

● నేడు 'ప్రపంచ హృదయ దినోత్సవం'

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వైద్య విభాగం

ప్రస్తుత జీవన విధానం, మానసిక ఒత్తిడి, మారిన ఆహారపు అలవాట్లతో ఉమ్మడి జిల్లాలో గుండె సంబంధిత వ్యాధుల బారిన పడే వారి సంఖ్య పెరిగిపోతోంది. ప్రధానంగా మానసిక ఒత్తిడి కారణంగా రక్తపోటు(బీపీ) పెరిగి గుండె లయతప్పి మృత్యువాత పడుతున్న బాధితులు పెరిగిపోతున్నారు. బీపీ బారిన పడ్డ వారికి మధుమేహం, థైరాయిడ్ సమస్యలు ఏర్పడి అవి గుండెపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి. ఇది వరకు ఐదుపదుల వయసు దాటిన వారిలో మాత్రమే ఇలాంటి సమస్యలు కనిపించేవారు. ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా గుండె సమస్యలు, బీపీ, మధుమేహం బారిన పడుతున్నారు. రక్తపోటు వంశపారంపర్యంగా కూడా వచ్చే అవకాశాలున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. దీని బారిన పడ్డ వారు మధుమేహం, థైరాయిడ్ గురయ్యే అవకాశాలుంటాయంటున్నారు. యుక్త వయస్కుల్లో సాధారణ బీపీ 120(సిస్టోలిక్), 80(డయాస్టోలిక్) ఉండాలి. రక్తపోటు వచ్చిన వారికి గుండె జబ్బులు ముప్పు పొంచి ఉంటుందన్నారు.

తల్లి గర్భంలో నెలల శిశువుగా ఉన్నప్పుడే గుండె స్పందన ప్రారంభమై మనిషి మృతి చెందే వరకు రెప్పపాటు కాలం కూడా ఆగకుండా పని చేస్తుంది. కేవలం కొన్ని నిమిషాలు గుండె పని చేయటం మానేస్తే జీవితం అంతం అయిపోతుంది. అందుకే గుండెను ఆరోగ్యంగా కాపాడుకుంటేనే జీవించి ఉండగలుగుతాం. ప్రజలంతా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో ఏటా సెప్టెంబరు 29న 'ప్రపంచ హృదయ దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 1.87 లక్షల మంది బాధితులు

ఆదిలాబాద్	నిర్మల్	కుమురం భీం	మంచిర్యాల
32,995	75,563	19,003	60,071

● జిల్లా ● రక్తపోటు బాధితులు

లక్షణాలుంటే వైద్యుడిని సంప్రదించాలి

- కస్తూరి శ్రీనివాస్, జనరల్ ఫిజీషియన్, రిమ్స్



గుండె సంబంధిత వ్యాధులు, బీపీ లక్షణాలు ఏమాత్రం ఉన్నా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. వైద్యుల సూచనలు పాటిస్తూ క్రమం తప్పకుండా నిర్ణీత సమయంలో మందులు వాడాల్సి ఉంటుంది. లేకుంటే ప్రాణాలకే ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంటుంది. రోజూ కాసేపు వ్యాయామం చేస్తే వీటి ముప్పును చాలా వరకు తగ్గించుకోవచ్చు.

ఇబ్బందులను నిర్లక్ష్యం చేయొద్దు

- రాజేష్, గుండె వైద్యనిపుణులు, మంచిర్యాల



ఛాతిపై ఒత్తిడి, అసౌకర్యం, కాళ్లు, చేతుల్లో నొప్పులు, అలసట, చెమటలు పట్టడం, తల తిరగడం, వేగంగా గుండె కొట్టుకోవడం ఇలా ఎలాంటి ఇబ్బందులు కలిగినా వెంటనే సంబంధిత వైద్యుడిని సంప్రదించడం అవసరం. వీటిని ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా పరిణామాలు తీవ్రంగా ఉండటమే కాకుండా ప్రాణహాని ఉండే అవకాశం ఉంది. ఏ చిన్న ఇబ్బంది తలెత్తినా అశ్రద్ధ చేయవద్దు. జీవనశైలి, ఆహార అలవాట్లు ఆరోగ్యకరంగా ఉంచుకోవాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవి..

- అనునిత్యం శారీరక శ్రమ ఉండాలి, తప్పకుండా వ్యాయామం చేయాలి
- అధిక పోషకాహారం (ఆకుకూరలు, కూరగాయలు) తీసుకోవాలి.
- నూనె పదార్థాలు, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండటం మంచిది
- ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండటానికి ప్రయత్నించాలి
- ఏదైనా తీవ్ర ఒత్తిడికి గురైతే ఉపశమనం కోసం క్రీడలు, ఇతర వ్యాపకాలపై దృష్టి సారించాలి
- ఉప్పు అధికంగా వాడొద్దు
- రోజూ 8 గంటలు ప్రశాంతంగా నిద్రపోవాలి.

ఎరుపెక్కిన అంబరం.. చూపరులకు సంబరం



కారుమబ్బులు చీల్చుకుంటూ సూర్యోదయం వేళ భానుడి అరుణ కిరణాలతో ఆకాశం ఎరుపెక్కింది. మబ్బులన్నీ ఎరుపు వర్ణాన్ని సంతరించుకొన్న అంబరం చూపరులకు సంబరాలను నింపి ప్రకృతి రమణీయతను చాటింది. మెల్లమెల్లగా సూర్యుడు బయటకు రావడంతో ఆకాశం ఎరుపు వర్ణాన్ని వీడి నీలం రంగులోకి మారింది. నింగిలో ఈ సుందర దృశ్యం భానాపూర్, భైంసా మండలం ఇలేగాం, తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 5:30 తర్వాత ఆవిష్కృతమైంది. తెల్లవారడంతోనే ప్రజలకు కనువిందు చేసింది.

- భానాపూర్, భైంసా, న్యూస్‌టుడే

నరభక్షక పులి చేజిక్కే..



స్పృహ కోల్పోయిన టి-83 పులి వద్ద అటవీ అధికారులు

బల్లార్ష, న్యూస్‌టుడే: మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా మూల్ తాలూకా చిచ్‌పల్లి అటవీక్షేత్రంలో నలుగురిని హతమార్చిన టి-83 అనే పులిని శనివారం అటవీశాఖ అధికారులు బంధించారు. జనాడా, కాంతాపేట్, చిరోలి, కడ్‌బోట్, చింతాడా తదితర గ్రామ పరిసరాల అడవుల్లో సంచరిస్తూ పదిహేను రోజుల్లో నలుగురు పశువుల కాపరుల ప్రాణాలు తీసింది. దీంతో స్థానికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. రాష్ట్ర అటవీశాఖ మంత్రి మునగంటివార్ ఇటీవల పులిని వెంటనే పట్టుకోవాలని ఆదేశాలు జారీచేశారు. ఈక్రమంలో అధికారులు అడవిలో పలుచోట్ల బోన్లు ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు అమర్చారు. ఈ ప్రయత్నాలు విఫలం కావడంతో డ్రోన్ సాయంతో శనివారం జనాడా గ్రామ పరిసర అడవుల్లో సంచరిస్తోందని గుర్తించారు. ప్రముఖ షూటర్ అజయ్ మరాఠే సాయంతో పులికి మత్తుమందు ఇచ్చి స్పృహ కోల్పోయేలా చేశారు. అభయారణ్యాల పశువైద్యాధికారి రవికాంత్ దేశ్‌పాండే పరిశీలించిన తర్వాత దాన్ని చంద్రపూర్ కేర్ సెంటర్‌కు తరలించారు.

పుస్తకాల కింద పాము..



కౌటాల, న్యూస్‌టుడే : కౌటాల మండలంలోని కన్నెపెల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం పాము కలకలం సృష్టించింది. ఉదయం వచ్చిన విద్యార్థులు తరగతి గదిలో కూర్చొని ఉండగా పుస్తకాల కింద పాము ఉండడంతో ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఉపాధ్యాయులు వెంటనే స్పందించడంతో స్థానికుల సహాయంతో దాన్ని చంపారు. ప్రహరీ గోడ లేకపోవడంతో తరచూ బడి ఆవరణలోకి విషపురుగులు వస్తున్నాయని ప్రధానోపాధ్యాయురాలు అనూష తెలిపారు.

తిరుపతి ఘటనపై న్యాయవిచారణ జరపాలి : వీహెచ్‌పీ

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: తిరుపతిలో లడ్డూ ప్రసాదంలో కల్తీ ఘటనపై సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని విశ్వహిందూపరిషత్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ విఠల్ డిమాండ్ చేశారు. నిర్మల్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కలియుగదైవంగా భక్తులు పూజించే ఆలయంలో అపవిత్రత చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. దేవాదాయశాఖను రద్దుచేసి, ధార్మిక వ్యక్తులకు నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఈ డిమాండ్ల సాధనకు ఈనెల 30న నిర్మల్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందూరు విభాగ్ ధర్మాచార్య సంపర్క్ ప్రముఖ్ పతికె రాజేందర్, జిల్లా కార్యదర్శి మూర్తి ప్రభాకర్, సాదం ఆనంద్, పతికె రమేశ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకుంటే కిడ్నీలు అమర్చుతాం

ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే : డయాలసిస్ బాధితులు దరఖాస్తులు చేసుకుంటే లక్షలను ఖర్చే ఉచితంగా రిమ్స్ ఆసుపత్రిలో కిడ్నీలను జీవన్‌దాన్‌లో భాగంగా అమర్చే ఏర్పాటు చేస్తామని హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రి నెఫ్రాలజిస్ట్ వైద్యుడు కార్తిక్ పేర్కొన్నారు. ఆయనతో పాటు నిమ్స్ మరో నెఫ్రాలజిస్ట్ శశాంక్ రిమ్స్ డయాలసిస్ కేంద్రాన్ని శనివారం సందర్శించి పరిశీలించారు. జీవన్‌దాన్ గురించి అవగాహన కల్పించారు. రిమ్స్ సంచాలకుడు డాక్టర్ రాఠోడ్ జైసింగ్, ఆపరేషన్ క్వాలిటీ మేనేజర్ జీవన్, కేంద్రం బాధ్యుడు ప్రేందాస్ సిబ్బంది ఉన్నారు.




రిమ్స్‌లోని డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న నిమ్స్ ఆసుపత్రి వైద్యులు

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి



RAMOJI FILM CITY



సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి



రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.

మరిన్ని వివరాలకు.. www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

మూడేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నం

● నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ పట్టణంలోని ఒక కాలనీలో మూడేళ్ల చిన్నారిపై దాదాపు 45 సంవత్సరాల వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన శనివారం వెలుగు చూసింది. అదే కాలనీకి చెందిన నంద కుమార్ అనే వ్యక్తి మరుగుదొడ్డిలోకి తీసుకెళ్లి అత్యాచారయత్నం చేసినట్లు కుటుంబ సభ్యులు ఆదిలాబాద్ టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు చిన్నారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు.

సిమెంటు ఇటుకలతో.. మనసుదోచే శిల్పాలు

● విశ్రాంత ఉద్యోగి కళారాధన

ఈటీవీ - ఆదిలాబాద్ :

అయోధ్యలో కొలువుదీరిన రాంలల్లా. శాంతిని ప్రబోధించే గౌతముడు. హంపినగర శిల్ప సౌందర్యం. కాకతీయ సామ్రాజ్య కళా వైభవం. అన్నీ ఒకే చోట కొలువైతే. ఎంత బాగుంటుంది. దాన్ని సుసాధ్యం చేశారో విశ్రాంత ఉద్యోగి. ఆరు పదుల వయసులో తనలో దాగి ఉన్న శిల్పకళను తట్టిలేపారు. మనసును మంత్రముగ్ధులను చేసే ఎన్నో కళాకృతులకు జీవం పోశారు. కళారాధనంటే వ్యాపార దృక్పథం కాదు. మనసును తేలిక పర్చుకోవడమనేలా సాగుతున్న శిల్ప కళా సౌందర్యంపై 'ఈటీవీ - ఈనాడు' ప్రత్యేక కథనం.

ఆదిలాబాద్‌లోని జీఎస్ కాలనీలో నివాసం ఉండే కె.జ్యోతిశ్రీ-కేవీ రావు దంపతులది సాధారణ మధ్య తరగతి కుటుంబం. సిమెంటు పరిశ్రమ విశ్రాంత ఉద్యోగి అయిన కేవీరావుకు చిన్నప్పటి నుంచి కళలంటే అమితమైన ఆసక్తి. కరోనా సమయంలో తన కళా నైపుణ్యానికి పదును పెట్టారు. మార్కెట్లో లభించే సిమెంటు ఇటుకలను కొనుగోలు చేసి శిల్పాలుగా మలచడం ప్రారంభించారు. సుద్దముక్కలను శిల్పాలుగా తీర్చిదిద్దేందుకు యత్నించారు. ఎన్నోసార్లు విఫలయ్యారు. సుద్దముక్కలు, ఇటుకలు విరిగిపోయాయి. వినియోగించిన చిన్నపాటి ఉలి, రంపంతో చేతివేళ్లకు గాయాలయ్యాయి. అయినా పట్టువీడలేదు. ఆలోచనను విరమించుకోలేదు. ఎన్నో అబ్బురపరిచే కళాకృతులకు ప్రాణం పోశారు. చూపరులను మంత్రముగ్ధులను చేసే శిల్పాలను తీర్చిదిద్దారు. ఆయన ఇంట్లోని ఓ గది చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని తట్టిలేపే ఎన్నో శిల్పాలతో నిండిపోయి ఉందంటే ఆశ్చర్యం వేయకమానదు.



ప్రతిమలను చెక్కుతున్న కేవీరావు



చిత్రం విచిత్రమే..

ఆరు అంగుళాల సుద్దముక్క నుంచి మొదలుకొని రెండు అడుగుల వరకున్న తేలికపాటి సిమెంటు ఇటుకలే ముడిసరకుగా బొమ్మలుగా చెక్కడంలో ఆయన దిట్ట. ఇటుకపై తయారు చేసిన బుద్ధుడి బొమ్మను చూస్తే హుస్సేన్‌సాగర్‌లో ఉన్న ప్రతిమ చిత్రంగా అనిపిస్తుంది. రెండు అంగులాల సుద్దముక్కపై చెక్కిన శివాజీ ముఖాన్ని చూస్తే చాలు ఆశ్చర్యం వేయకమానదు. దేవాలయాలు, చారిత్రక కట్టడాలు, నాట్యభంగిమలు, ఏనుగులు, గుర్రాలతో కూడిన శిల్ప సౌందర్యం, సింగపూర్ రాజముద్ర, గోడలకు అతికించేలా దేవతాప్రతిమలు, టీవీ స్టాండ్లు ఇలా ఎన్నో ఆకృతులకు ప్రాణం పోస్తున్నారు.

స్నేహితులకు, బంధువులకు బహుమతులుగా..

తయారు చేసిన శిల్పాల క్రయవిక్రయాలకు ప్రాధాన్యం ఇవ్వరు. వివాహాలు, ఇతర శుభ కార్యాల్లో బహుమతులుగా అందజేస్తారు. స్నేహితులకు బహుమానంగా ఇస్తారు. ఇటుకలు కొనిచ్చి తమకు కావాల్సిన ప్రతిమను తయారుచేయమని మిత్రులు అడిగితే ఉచితంగానే చేసి ఇస్తారు. నేను ఎంచుకున్న కళారాధన వ్యాపారం కోసం కాదు. మానసిక ఆనందం కోసమే. సతీమణి జ్యోతిశ్రీ ప్రోత్సాహంతోనే ఇది సాధ్యమైందని కేవీరావు చెబుతుంటారు.



తయారు చేసిన శిల్పాలతో కేవీరావు దంపతులు

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే

? చింతగూడ కోయవాగులోని మురుగు కాలువల్లో పూడికతీయక అపరిశుభ్రత నెలకొంది. -సోమిశెట్టి రాజ్‌కుమార్, చింతగూడకోయవాగు

✔ మండలంలోని అన్ని పంచాయతీల్లో మురుగు కాలువల్లో పూడిక తీయించేలా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం. - రమేష్, ఎంపీడీఓ, కాగజ్‌నగర్

స్వచ్ఛతపై విద్యార్థుల మానవహారం

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా.. శనివారం పట్టణంలోని కస్తూర్బా విద్యాలయంలో స్వచ్ఛతాహీ సేవ ఆంగ్ల అక్షరాలతో 283 మంది విద్యార్థులు మానవహారం నిర్వహించారు. మున్సిపల్, ఎస్పీఎం, పునర్నవ సోషల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. తడి, పొడి వేరు చేయడం, పరిసరాల విజ్ఞానం, శుభ్రత, స్వచ్ఛభారత్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. పర్యావరణ ఇంజినీర్ ప్రణీల్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.శంకర్, ప్రిన్సిపల్ రమాదేవి, పునర్నవ సోషల్ ఫౌండేషన్ డైరెక్టర్ బొర్లకుంట అశోక్, ఎస్పీఎం సీఎస్ఆర్ మేనేజర్ రీనా బిల్వాల్, ప్రాజెక్టు అధికారి సుందరం తదితరులు పాల్గొన్నారు.


కస్తూర్బా విద్యార్థులు


నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు

రేషనలైజేషన్ ఉత్తర్వులను సవరించాల్సిందే

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: అశాస్త్రీయమైన సర్దుబాటు జీవో నం. 25ను సవరించి, సర్దుబాటుకు ముందే బదిలీ అయిన ఎస్జీటీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం ఆర్డీఓ లోకేశ్వర్‌రావుకు వినతి పత్రం సమర్పించారు. స్టీరింగ్ కమిటీ నాయకులు సోయం ఇందువు, జాదవ్ కిషన్ కుమార్ మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని, ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:20గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను మీడియం వారీగా లెక్కించాలని, అదనపు ఉపాధ్యాయులు 1:30 నిష్పత్తిలో చూడాలని పేర్కొన్నారు. నాయకులు హేమంత్ షిండే, టి.రమేశ్, సీహెచ్.శ్యాంరావు, రాథోడ్ రవీందర్, సంజయ్‌కుమార్, బాదిరావ్, మన్యు, కిషన్, ఆనంద్‌రావ్ తదితరులున్నారు.

సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటు చేయాలి

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: సనాతన ధర్మ పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా బోర్డు ఏర్పాటు చేయాలని కాగజ్‌నగర్ పట్టణ జనసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేస్తున్న ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా శనివారం బాలాజీనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. తిరుమల లడ్డూ కల్తీ విషయంలో బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్ ప్రతిపాదన మేరకు కేంద్రం బోర్డు ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. జనసేన నాయకులు పోతుల ప్రవీణ్, అక్కెనపెల్లి బాలేష్, చెట్టి రాజేష్, పెరుగు మనీష్, అరికిల్ల గణేష్, అక్కెనపెల్లి సాయికృష్ణ, వినేష్‌రెడ్డి, అల్లూరి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన సదస్సు

వాంకిడి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో శనివారం షీ టీం ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. షీటీం ఇన్‌ఛార్జి సునీత మాట్లాడుతూ.. హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైంలకు ఎవరైనా గురైతే వెంటనే షీటీంను సంప్రదించాలని సూచించారు. సామాజిక మాధ్యమాలు ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగాం వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర సమయాల్లో 100కు షీటీం ఆసిఫాబాద్ నం. 87126 70564కు కాల్ చేయాలని వివరించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు రాతపుస్తకాలు అందిస్తున్న క్లబ్ సభ్యులు

పర్యావరణ రక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలని ఆసిఫాబాద్ వాసవిక్లబ్ అధ్యక్షుడు కొలిప్యాక శంకర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడి ఆదేశాల మేరకు విద్యార్థులతో వివిధ రకాల పండ్ల విత్తనాలతో 1200 సీడ్‌బాల్స్ తయారు చేయించినట్లు చెప్పారు. వీటిని అటవీ ప్రాంతాల్లో వేయడంతో పండ్ల మొక్కలు పెరిగి జంతువులకు ఆహారం లభిస్తుందని, అటవీ విస్తీర్ణం పెరుగుతుందని వివరించారు. అనంతరం విద్యార్థులకు రాత పుస్తకాలు, పెన్నులు అందించారు. క్లబ్ ప్రతినిధులు ఎకిరాల శ్రీనివాస్, గంధం శ్రీనివాస్, గుండా ప్రమోద్, వాసవి మందిర్ అధ్యక్షుడు రావుల శంకర్, శిశుమందిర్ కార్యదర్శి కొలిప్యాక వేణుగోపాల్, పాఠశాల ప్రధానాచార్యులు గుండేటి కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఆశ్రమోన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం

బెజ్జూరు, న్యూస్‌టుడే : కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మాజీ జడ్పీటీసీ సభ్యురాలు పుష్పలత అన్నారు. శనివారం మండలంలోని సోమిని ఆశ్రమోన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించినప్పుడే ఉపాధ్యాయులకు గుర్తింపు వస్తుందన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు భిక్షమయ్యను సన్మానించారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు సాయి, శ్రీనివాస్, సర్పంచులు, గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

షిర్డీ సాయిబాబా జన్మదిన వేడుకలు

కాగజ్‌నగర్ గ్రామీణం: పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో శనివారం బాబా జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, నగర సంకీర్తన, అభిషేకం, అలంకరణ, సాయంత్రం భజన కార్యక్రమాలు చేశారు. భగవాన్ శ్రీసత్యసాయి సేవా సమితి కాగజ్‌నగర్ కన్వీనర్ నాగేశ్వర్ ఆధ్వర్యంలో బాబాకు విబూది అభిషేకం, జన్మరహస్యంపై దివ్య సందేశం, మహా మంగళహారతి కార్యక్రమాలు జరిపారు. జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు డి.జనార్దన్, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేత

వాంకిడి, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కాగజ్‌నగర్‌లో ప్రజ్ఞ వికాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలోని ఏడో తరగతి విద్యార్థిని బి.శ్వేత ప్రథమ బహుమతి గెలుచుకుంది. శనివారం ఎంఈఓ శివచరణ్ ఆ విద్యార్థినికి ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

రహదారిపై ఇసుక.. జర జాగ్రత్త


బస్టాండ్ మూలమలుపు వద్ద ఇసుకతో నిండిన సిమెంట్ రహదారి

సిర్పూర్(టి), న్యూస్‌టుడే:

చక్కగా కనిపించే రహదారి మాటున ప్రమాదం పొంచి ఉంది. సిమెంటు, తారు రోడ్లపై సన్నటి ఇసుక నిలుస్తుండటంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ద్విచక్ర వాహనదారులకు ఇది ప్రధాన సమస్యగా మారుతోంది. ఏమాత్రం వేగంగా వెళ్లినా జారిపడిపోతున్నారు. భారీ వాహనాలు వెళ్లే క్రమంలో, కురుస్తున్న వర్షాలకు రోడ్లపై ఇసుక, మట్టి చేరి అలాగే నిలుస్తోంది. సిర్పూర్(టి)లోని ప్రధాన ప్రాంతాల్లో ఉన్న రహదారులు అధ్వానంగా మారాయి. ఇదివరకే గుంతలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులకు ఇసుక మరో సమస్యగా మారింది. దీంతోపాటు మురుగు నీటి వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో.. మురుగు నీరు కూడా రోడ్లపైకి చేరి అధ్వానంగా మారుస్తున్నాయి. పంచాయతీ కార్మికులు రోడ్లపై చేరిన ఇసుక, మట్టిని ఎప్పటికప్పుడు తొలగించాల్సి ఉన్నా.. అటువంటి చర్యలు కనిపించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


పేట్‌మైల వద్ద ఇసుక మేటలతో..

సమస్యాత్మక ప్రాంతాలు..

★ ఎస్బీఐ వద్ద రోడ్డుపై ఇసుక మేటలు వేయడంతో.. వారం రోజుల్లో నలుగురు ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కిందపడి గాయాలపాలయ్యారు.

★ బస్టాండ్ మూల మలుపు వద్ద ఉన్న సిమెంట్ రోడ్డుపై ఇసుక చేరి వాహనాలు అదుపు తప్పుతున్నాయి.

★ పేట్‌మైల వద్ద ఇరుకు రోడ్డు కారణంగా రద్దీ ఎక్కువగా ఉంటుంది. కురుస్తున్న వానలకు గుంతల్లో నీరు చేరడంతో పాటు రోడ్డు పైన ఇసుక చేరుతుండటంతో.. వాహనాలకు బ్రేక్ వేసే క్రమంలో అదుపు తప్పుతున్నాయని వాపోతున్నారు.

★ డౌనల్ ఏరియాలోని రోడ్డు గుంతలతోపాటు ఇసుక, రాళ్లతో ఉండటంతో.. వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతోపాటు రోడ్డు కిందికి ఉండటంతో ఏ మాత్రం అప్రమత్తంగా లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి.

★ ఈ విషయమై 'న్యూస్‌టుడే' సిర్పూర్(టి) పంచాయతీ కార్యదర్శి తిరుపతిని వివరణ కోరగా.. రెండు రోజుల్లో పంచాయతీ సిబ్బందితో రోడ్లపై ఉన్న ఇసుకను తొలగింపజేస్తామన్నారు. డౌనల్ ఏరియా వద్ద రోడ్డు మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : విప్లవకారుడిగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా చరిత్రలో నిలిచిన వీరుడు భగత్‌సింగ్ అని ప్రజా సంఘాల సభ్యులు పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన ఆశయాలు, ఆలోచనలు, ఆవేశం ఎంతో మంది యువతలో స్ఫూర్తి నింపిందన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టికానంద్, కార్తీక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దినకర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, టీఏజీఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలశ్రీ, ఆయా సంఘాల సభ్యులు శ్రావణి, నిఖిల్, చిట్టి పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని మాతృశ్రీ, చైతన్య జూనియర్ కళాశాలల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యుడు భీంరావు, వంశి, సాయి, నితీష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ నాయకుల ఆధ్వర్యంలో..

కాగజ్‌నగర్: సమాజంలో జరిగే అన్యాయాలను ప్రశ్నించడమే భగత్‌సింగ్‌కు ఇచ్చే నిజమైన నివాళి అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చాపిలె సాయికృష్ణ తెలిపారు. పట్టణంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శనివారం భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు వసాకె సాయికుమార్, ఉపాధ్యక్షుడు తుమ్మిడె భీమేష్, సహాయ కార్యదర్శి సిరికొండ నితీష్, సుంకరి సాయి తదితరులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రజాసంఘాల సభ్యులు

నిందితుడికి కఠిన శిక్ష పడాల్సిందే

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : మైనర్ బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని విద్యార్థులు, గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. శనివారం మండలంలోని బూరుగూడ జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. సుమారు గంట పాటు జరగడంతో ఇరువైపులా ట్రాఫిక్ నిలిచింది. విషయం తెలుసుకొని సీఐ సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు వచ్చారు. కలెక్టర్, ఎస్పీ రావాలంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ.. నిందితుడికి ఉరి శిక్ష విధించాలని, బాలికలకు రక్షణ కల్పించాలంటూ డిమాండ్ చేశారు. ఇలాంటి వారు గ్రామంలో ఉంటే మహిళలు, పిల్లలకు రక్షణ లేకుండా పోతుందని వాపోయారు. పిల్లలను బయటకు పంపించాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారన్నారు. విద్యార్థులకు సీఐ నచ్చజెప్పే ప్రయత్నం చేసినా కొంతసేపు వినకుండా రోడ్డుపై నుంచి కదల్లేదు. జైలు నుంచి బయటకు రాకుండా చూడాలని డిమాండ్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని, శిక్ష పడేలా చూస్తామని చెప్పి ధర్నాను విరమింపజేశారు. సదరు కాలనీకి చెందిన మహిళలు సైతం కఠినంగా శిక్షించాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.


ధర్నా చేస్తున్న విద్యార్థులు, గ్రామస్థులు

పోక్సో కేసు నమోదు

మైనర్‌ను అత్యాచారం చేసిన బొమ్మెన సాగర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సతీష్ తెలిపారు. శనివారం సాయంత్రం పాఠశాల నుంచి బాధితురాలు ఇంటికి వస్తున్న క్రమంలో నిందితుడు అడ్డుకొని మాయ మాటలు చెప్పి ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేసినట్లు చెప్పారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సాగర్‌పై 65(1) బీఎన్ఎస్, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

క్రీడలకు సమయం కేటాయించండి

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే : సింగరేణి యాజమాన్యం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని ఉద్యోగులు క్రీడల్లో రాణించాలని బెల్లంపల్లి ఏరియా ఎస్ఈ (సివిల్) ఎస్‌కే మదీనా భాషా అన్నారు. బెల్లంపల్లి ఏరియా వర్క్‌పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం కబడ్డీ పోటీలను నిర్వహించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులకు అనుగుణంగా యాజమాన్యం మైదానాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విధుల్లో బిజీగా ఉండే కార్మిక క్రీడాకారులు కాసేపు క్రీడలకు సమయం కేటాయిస్తే శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసంగా ఉంటారన్నారు. ఈ ప్రాంతం స్పోర్ట్స్ గోలేటిగా పేరుతుందని, ఏరియా నుంచి పోటీల్లో మంచి క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి సింగరేణి, కోలిండియా స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, డబ్ల్యూఎస్ కోఆర్డినేటర్ కిరణ్‌బాబు, జనరల్ కెప్టెన్ జీపీ చంద్రకుమార్, ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శులు బి.జగ్గయ్య, జుపాక రాజేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.


కబడ్డీ ఆడుతున్న ఏరియా ఎస్ఈ (సివిల్) ఎస్‌కే మదీన భాషా

మెరుగైన దీపావళి బోనస్ సాధించేందుకు కృషి

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: దిల్లీలోని కోలిండియా కార్యాలయంలో దీపావళి బోనస్‌పై ఆదివారం పీఎల్ఆర్ (పర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్) సమావేశం ఉంటుందని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ హైమద్ ఒక ప్రకటనలో తెలిపారని ఆ సంఘం బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజబాబు చెప్పారు. జేబీసీసీఐ కమిటీలో ముగ్గురు సభ్యులున్న ఏకైక యూనియన్ హెచ్ఎంఎస్ అని అన్నారు. కోలిండియా ఛైర్మన్ నుంచి తమ నాయకుడు రియాజ్ హైమద్‌కు సమాచారం అందినట్లు తెలిపారు. గతేడాది కార్మికులకు రూ. 85,500 దీపావళి బోనస్ సాధించామని, ఈసారి మరింత మెరుగైన బోనస్ సాధించేందుకు కృషి చేయనున్నారని పేర్కొన్నారు.


మాట్లాడుతున్న వైద్యాధికారి ఉప్రె వినయ్

సికిల్‌సెల్ ఎనిమియా నివారణకు కృషి

వాంకిడి, న్యూస్‌టుడే: ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు ఉప్రె వినయ్ మాట్లాడుతూ.. ఇది జన్యుపరంగా వచ్చే వ్యాధి అని, ప్రారంభ దశలో గుర్తిస్తే నివారించవచ్చని వివరించారు. దీర్ఘకాలిక రక్తహీనత, ఎముకలలో తీవ్రమైన నొప్పి ఉంటే ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. దీన్ని నివారించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సదస్సులో ఎంపీఓ ఖాజాఅజీజొద్దీన్, ఎంఈఓ శివచరణ్, ఏపీఓ శివకుమార్, ఆరోగ్య విస్తరణాధికారి రవిదాస్, పీహెచ్ఎన్ క్రిష్టియానా, సూపర్‌వైజర్ అనసూయ, గ్రామ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

పోటాపోటీగా చెస్, హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల క్రీడా ఆదర్శ పాఠశాల మైదానంలో శనివారం చెస్, హ్యాండ్‌బాల్ క్రీడల జిల్లా స్థాయి ఎంపిక పోటీలు పోటా పోటీగా జరిగాయి. హ్యాండ్‌బాల్ పోటీలను ఏసీఎంవో పి.ఉద్ధవ్ ప్రారంభించగా, చెస్‌ను మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ ప్రారంభించారు. హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లాలోని 100 మంది క్రీడాకారులు, చెస్ పోటీల్లో 180 విద్యార్థులు హాజరైనట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పి.సాంబశివరావు తెలిపారు. హ్యాండ్‌బాల్ పోటీలకు క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగు, కోచ్ అరవింద్‌లు కన్వీనర్, కార్యదర్శిగా వ్యవహరించగా చెస్‌కు ప్రధానోపాధ్యాయులు మనోహర్, పీఈటీ రవి కన్వీనర్, కార్యదర్శులుగా వ్యవహరించారు. పోటీల్లో ఎంపికైన విద్యార్థులు మంచిర్యాలలో జరిగే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రకటించారు. గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి బండ మీనారెడ్డి, కోచ్‌లు రాకేష్, రవి, పీడీ, పీఈటీలు విద్యాసాగర్, సాయి, రజిత, యాదగిరి ప్రమోద్ పాల్గొన్నారు.


హ్యాండ్‌బాల్ పోటీల విజేతలతో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సాంబశివరావు

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

రెబ్బెన, న్యూస్‌టుడే: పోషక విలువలతో కూడిన పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చని అంగన్‌వాడీ టీచర్లు అన్నారు. శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని గోలేటి-4 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమంలో అన్నప్రాసన నిర్వహించారు. కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న బాలామృతాన్ని క్రమం తప్పకుండా పిల్లలకు తినిపించాలన్నారు. మనం తీసుకునే ఆహారంలో కూరగాయలు, ఆకుకూరలు, కోడిగుడ్లు, పాలు ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. ముందుగా పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు సంధ్యారాణి, మంజుల, స్వర్ణలత, సుశీల, సాంబలక్ష్మి, భాగ్యలక్ష్మి, ప్రమీల, చంద్రకళ, రుక్మిణి, బాలమ్మ, మల్లీశ్వరి, ఏఎన్ఎం శైలజ పాల్గొన్నారు.


అన్నప్రాసన చేయిస్తున్న అంగన్‌వాడీ ఉపాధ్యాయులు

దోబీఘాట్ స్థలం కాపాడాలని వినతి

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: పట్టణంలోని ద్వారకానగర్‌లో ప్రభుత్వం రజకుల కోసం కేటాయించిన స్థలం అన్యాక్రాంతం అవుతోందని, విచారణ చేపట్టి కాపాడాలని కోరుతూ.. పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో శనివారం సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లకు వినతి పత్రం అందజేశారు. 1987లో అప్పటి ప్రభుత్వ విప్ కేవీ నారాయణరావు ఈ స్థలంలో రజక వృత్తికి అవసరమైన స్థలాన్ని కేటాయించారని, 40 సంవత్సరాలుగా ఇక్కడ రజక వృత్తి చేపడుతూ జీవిస్తున్నట్లు చెప్పారు. స్థలం తమదంటూ ఓ వ్యక్తి నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎల్లయ్య, రాజేష్, లింగయ్య, కరుణాకర్, కనకరాజు, లింగం, బాపు, వెంకటేష్, శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.


సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లకు వినతిపత్రం అందజేస్తున్న రజక సంఘం నాయకులు

జీఓ నం.25 పునఃపరిశీలించండి

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ప్రభుత్వం జారీ చేసిన జీఓ నం. 25ను రద్దు చేయాలని ఆదివాసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు తలండి లక్ష్మణ కోరారు. 11-60 మంది విద్యార్థులకు కేవలం ఇద్దరు ఉపాధ్యాయులే బోధించడం విద్యావ్యవస్థను నిర్వీర్యం చేయడమే అవుతుందన్నారు. జీఓలో శాస్త్రీయత లోపించిందని, విద్యాశాఖ తక్షణమే పునఃపరిశీలించాలన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : హైదరాబాద్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాగర్జన కార్యక్రమంలో నాయకులను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ.. శనివారం పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వసాకె సాయికుమార్, చాపిలె సాయికృష్ణ మాట్లాడుతూ.. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మహాగర్జన నిర్వహిస్తే అరెస్టులు చేయడం ప్రభుత్వ చేతకానితనమని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పాటై ఎనిమిది నెలలైనా సమస్యల పరిష్కారంలో చొరవ చూపడం లేదని ఆరోపించారు. అరెస్టు చేసిన నాయకులను విడుదల చేసి కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు తుమ్మిడె భీమేష్, సహాయ కార్యదర్శి సిరికొండ నితీష్, సుంకరి సాయికుమార్ తదితరులున్నారు.



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు


విజేతలతో అధికారులు


బాలికల జానపద నృత్య ప్రదర్శన

జానపద నృత్యాలు అలరించే!

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : రాష్ట్ర విద్యాశిక్షణ పరిశోధన సంస్థ ఆదేశాల మేరకు.. విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల విద్యార్థులకు జిల్లా స్థాయి జానపద నృత్య పోటీలను నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన విద్యార్థులు తమ నృత్యాలతో అలరించారు. కార్యక్రమానికి నేతృత్వం వహించిన జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. కుమురం భీం జిల్లా జానపద కళలకు నిలయమని, జానపదాలు సంస్కృతీ సంప్రదాయలకు ప్రతీకలని పేర్కొన్నారు. పోటీల్లో బాలబాలికలు అద్భుతమైన జానపద ప్రదర్శనలు చేశారని అభినందించారు. ప్రథమ స్థానంలో నిలిచిన కౌటాల కస్తూర్బా పాఠశాల బృందానికి రూ. 1800 నగదు, ద్వితీయ స్థానంలో నిలిచిన రెబ్బెన కస్తూర్బా పాఠశాల బృందానికి రూ. 1200, తృతీయ స్థానంలో నిలిచిన చింతలమానెపల్లి కస్తూర్బా పాఠశాల బృందానికి రూ. 900 నగదును అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో జ్యూరీ సభ్యులుగా కిల్లీ వెంకట్రావు, సురేష్, ధర్మయ్య, ప్రధానోపాధ్యాయులు సుభాష్‌బాబు, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

అదనపు సిబ్బందిని నియమించాలని వినతి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లాలో డిజిటల్ క్రాప్ సర్వే కోసం క్షేత్ర స్థాయిలో అదనపు సిబ్బందిని కేటాయించాలని వ్యవసాయ విస్తరణ అధికారులు కోరారు. శనివారం కలెక్టరేట్‌లో ఏవో మధుకర్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు. ప్రభుత్వం ఆదేశించిన డిజిటల్ సర్వేకు క్షేత్ర స్థాయిలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ సర్వేలో ప్రతి గుంట భూమి, ప్రతి సబ్ సర్వే నంబర్ చిత్రాలను సేకరించాల్సి ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటకల్లో ఒక్కో విధంగా అక్కడి ప్రభుత్వాలు ఏర్పాట్లు చేసుకున్నట్లు చెప్పారు. సర్వే జయప్రదం కావాలంటే స్థానిక యువత/సర్వేయర్లను తాత్కాలిక విధానంలో నియమించేలా చూడాలని విన్నవించారు. ఏఈవోలు దుర్గా భవాని, వినోద, లక్ష్మి, శ్రీవిద్య, రోహిని, పరిమల, సిద్ధార్థ, రాము తదితరులున్నారు.


కలెక్టరేట్ ఏవో మధుకర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏఈవోలు

నూతన కమిటీ ఎన్నిక

చింతలమానెపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో శనివారం స్వేరో జిల్లా అధ్యక్షుడు డోంగ్రే సురేష్, జిల్లా స్వేరో మీడియా ఇన్‌ఛార్జి దుర్గం విజయ్ ఆధ్వర్యంలో.. స్వేరో మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా లొకండే భాస్కర్, ఉపాధ్యక్షుడిగా రాకేష్, జనరల్ సెక్రటరీగా షేక్ షారుఖ్, ట్రెజరి రాజు, సోషల్ మీడియా ఇన్‌ఛార్జిగా కార్తిక్, ట్రెజరి రాజు, స్పోక్స్ పర్సన్‌గా అశోక్, సభ్యులు గౌతం, శ్యామ్‌రావు, తదితరులున్నారు.